క్లుప్తంగా

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న కోరమాండల్ అధికారులు,వేమన సంక్షేమ సంఘ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో స్థానిక వేమన సంక్షేమ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో కోరమాండల్ సంస్థ సౌజన్యంతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. స్థానిక కుంచుమాంబ మహిళా సొసైటీ సభ్యులు, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



మేయర్ హరి వెంకటకుమారికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: వార్డు పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి శుక్రవారం 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ వినతి పత్రం అందజేశారు. మల్కాపురం,జనతాకాలనీ,బాపూజీకాలనీ, వెంకన్నపాలెం ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేయాల్సి ఉందన్నారు.అలాగే మల్కాపురం మార్కెట్ ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. నిధుల మంజూరుకు మేయర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ సుధ చెప్పారు.

గుల్లలపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో జీవీఎంసీ నిధులతో శుక్రవారం సీసీ రోడ్డు వేశారు. ఈ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యేవారు. సమస్యను వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఇటీవల పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన జీవీఎంసీ కమిషనర్‌తోపాటు మేయర్‌కు సమస్యను వివరించడంతో నిధులు కేటాయించారు. దీంతో గుల్లలపాలెం ప్రాంత ప్రజలు ఆనంద్‌కుమార్‌తో పాటు కార్పొరేటర్ గులిగిందల లావణ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

మేధాశక్తితో ఉన్నత శిఖరాలకు..



శ్రీనివాసరావును సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

కంచరపాలెం: విద్యార్థులు మేధాశక్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్పీపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్. శ్రీనివాసరావు అన్నారు. రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీబాయ్ శాఖ సంయుక్తంగా వికాస్ సప్తాహ్‌లో భాగంగా 8,9,10 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలతో కూడిన సామగ్రి అందజేశారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకుని సంస్కారవంతులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సత్యనారాయణ, రఘువీర్, నాగేశ్వరరావు, నారాయణస్వామి పాల్గొన్నారు.

మురికివాడకు మహర్దశ

- నాడు శిథిలమైన వాంబే ఇళ్లు.. నేడు కళ కళ
- వైద్య సౌకర్యం లేని గ్రామంలో హెల్త్ సెంటర్ నిర్మాణం
- 40వ వార్డులో రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులు



రూ. కోటితో నిర్మించిన ఆస్పత్రి



రాజీవ్‌కాలనీకి ఆనుకుని ఉన్న గెడ్డ



రూ.56 లక్షలతో ఆధునికీకరించిన గెడ్డ



జుగుప్సాకరంగా వాంబే నివాసాలు



మరమ్మతులు చేపట్టిన తర్వాత..

మల్కాపురం: శిథిలావస్థకు చేరిన వాంబే ఇళ్లు.. కాలువలు సరిగ్గా లేక మురుగు నివాసాల ముంగిటే వాడుక నీరు.. చిన్న అనారోగ్యం వచ్చినా వైద్యం కోసం దూర ప్రాంతానికి పరుగులు.. కళావిహీనంగా ఉన్న పాఠశాల ఇదీ జీవీఎంసీ 40వ వార్డులో పరిస్థితి. నేడు మురికివాడగా ఉన్న ఆ వార్డుకు మహర్దశ పట్టింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టంతో స్వరూపం మారింది. వాంబే ఇళ్లకు మరమ్మతులు చేపట్టారు. గెడ్డను ఆధునికీకరించి మురుగు సమస్యకు చెక్ పెట్టారు. వార్డులోనే రూ.కోటి పెట్టి వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించి చెంతనే వైద్యం అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఏకేసీకాలనీ,రాజీవ్‌కాలనీ ప్రజల కష్టాలు తీరాయి.

చేపట్టిన అభివృద్ధి పనులు క్లుప్తంగా...

- ఏకేసీకాలనీలో రూ. 96 లక్షలతో యూపీహెచ్‌సీ నిర్మాణం
- ఏకేసీకాలనీలో రూ.17 లక్షలతో సామాజిక భవనం నిర్మాణం .
- రాజీవ్‌కాలనీ నుంచి మెయిన్‌రోడ్డు వరకు రూ. 56 లక్షలతో గెడ్డ ఆధునికీకరణ.
- రూ.40 లక్షలతో శిథిలావస్థలో ఉన్న వాంబే ఇళ్ల మరమ్మతులు పూర్తి.
- రూ. 40 లక్షలతో కాలనీలో నివాసాల మధ్య ఖాళీ స్థలాల మరమ్మతులు పూర్తి చేశారు.
- రూ.20 లక్షలతో కాలనీలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం
- రూ.10 లక్షలతో భూగర్భ పైపులైన్ మార్పు
- రూ.12 లక్షలతో ఆస్పత్రి చుట్టూ రక్షణగోడ నిర్మాణం చేపట్టారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజల సమస్యలు పరిష్కరించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏకేసీకాలనీ,రాజీవ్‌కాలనీ,షిప్‌యార్డ్‌కాలనీల్లో తిరిగినప్పుడు ఇక్కడ ప్రజలు లపు సమస్యలను మా దృష్టిలో ఉంచారు. వారికి ఇచ్చిన మాట ప్రకారం నెలల వ్యవధిలోనే 60 శాతం పనులు పూర్తి చేసి అభివృద్ధి చూపించాం. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. – ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

మాట నెలబెట్టుకుంటున్నాం



వార్డులో ఏళ్ల తరబడి కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. వాంబే గృహాలు పెచ్చులూడి నివాసీయులు బెంబేలెత్తిపోయే వారు. మురుగు సమస్య వేధించేది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అవన్నీ దగ్గరగా చూశాం . దీంతో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పనులు చేపడుతున్నాం.నాడు వార్డులో పరిస్థితి నేటి పరిస్థితిని ప్రజలు గుర్తిస్తున్నారు.

–గుండపు నాగేశ్వరరావు
40వ వార్డు కార్పొరేటర్

పార్కులో చెట్లను అమ్మేశారు!



కేటరింగ్ ప్రాంగణంలో పోగు వేసిన చెట్ల కర్రలు,



పార్క్‌లో చెట్టు నరికి వేయగా మిగిలిన మోడు

గోపాలపట్నం: పార్క్‌లో బాగా పెరిగిన చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు స్థానిక కేటరింగ్ వాళ్లకు అమ్మేశారు.. వారు తెగనరికేసి దుంగలు తరలించుకుపోయారు. వివరాలు.. గోపాలపట్నం నడి బొడ్డున బంక్ సమీపంలోని వుడాకాలనీలో విశాలమైన పార్కు ఉంది. ఇందులో నీడనిచ్చే భారీ చెట్లు ఉన్నాయి. వ్యాయామం.. విశ్రాంతి కోసం పార్కుకు వెళ్లే వారు వీటి కిందే సేదతీరేవారు. అయితే స్థానికులు కొందరు వార స్వార్థం కోసం పార్కులో చెట్లను అమ్మేస్తున్నారు.

అనుమతిలేకుండానే..

చెట్లు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చెట్లు నాటుతుంటే వుడా కాలనీకి చెందిన కొందరు స్వార్థపరులు పార్కులో చెట్లను నరికేస్తున్నారు. దీనికి అధికారుల అనుమతులు కూడా తీసుకోలేదు. కాలనీ వాసులతో చర్చించలేదు. బుధవారం రాత్రికి రాత్రే నరికేశారు. వుడా కాలనీలో ఉన్న కేటరింగ్ వద్దకు తరలించేశారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై వుడాకాలనీ అసోసియేషన్ కమిటీ కూడా మౌనం వహించడంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపిక చేసిన పార్క్....

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో ఈ పార్క్ ఉంది. పది రోజులుగా ఈ పార్క్‌ను జోన్–8 అధికారుల పర్యవేక్షణలో 92వ వార్డు పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. ఇంతలో బుధవారం రాత్రికి రాత్రే చెట్లను కొట్టేసి కొమ్మలు ఇష్టాను రీతిగా పడేశారు. ఉదయం వాటిని చూసిన పారిశుధ్య సిబ్బంది విస్తుపోయారు. మధ్యాహ్నం నుంచి ప్రత్యేకంగా లారీలతో కొమ్మలు తరలించారు. కాగా పార్కులో చెట్లను అనుమతి లేకుండా కొనుగోలు చేసిన క్యాటరింగ్ సంస్థపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వారికి సహకరించిన వారిని కూడా వదిలిపెట్టవద్దని కోరుతున్నారు.

918వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు

కూర్మన్నపాలెం: కార్మికుల సమస్యలు పెడచెవిన పెడుతూ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 918వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు దీనస్థితిలో ఉన్నాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని హితవు పలికారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన రోబోటిక్ సర్జరీ



సర్జరీ అనంతరం కోలుకున్న నరేష్‌తో డాక్టర్ కార్తీక్ చంద్ర వల్లం, తదితరులు

ఎంవీపీ కాలనీ: మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఓ రోగికి అరుదైన రోబోటిక్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లాకు చెందిన జి.నరేష్(36) తీవ్ర జ్వరంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కారణంగా ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగంలో చేరాడు. ఆయన్ను పల్మోనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తాలే పరీక్షించి క్షయవ్యాధి కారణంగా ఊపిరితిత్తుల చుట్టూ(ప్లూరల్ ఎఫ్యూషన్) నీరు ఉందని గుర్తించారు. శస్త్ర చికిత్స ద్వారా ఆ నీరును తొలగించాలని సూచిస్తూ రోబోటిక్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కార్తీక్ చంద్రకు రిఫర్ చేశారు. అనంతరం వీఏటీఎస్(థొరాకోస్కోపిక్) డెకార్టికేషన్ రోబోటిక్ సర్జరీ ద్వారా ఊపిరితిత్తుల విస్తరణను నిరోధించే కణజాల పొరతో పాటు ఊపిరితిత్తుల చుట్టూ ఉన్న నీరును తొలగించారు. శరీరంపై 5–6 సెంటీమీటర్ల చిన్నపాటి రంధ్రం ద్వారా సున్నితమైన ఈ సర్జరీని డాక్టర్ కార్తీక్ చంద్ర బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోగి వేగంగా కోలుకుని, 4 రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ చంద్ర బృందాన్ని ఆస్పత్రి వర్గాలు అభినందించాయి.

బ్యాగ్ నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ఆనందపురం: బ్రాయిలర్ ఇండస్ట్రీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ విశాఖ (బ్యాగ్) అధ్యక్షుడిగా ఆనందపురానికి చెందిన కొట్యాడ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దిపాలెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా షేక్ పీర్ సాహెబ్(పెందుర్తి), కార్యదర్శిగా చిట్టూరి రామకృష్ణ(మధురవాడ), సంయుక్త కార్యదర్శిగా బి.సతీష్(విశాఖ), కోశాధికారిగా ఎస్.ఎన్.మాధవరావు(విశాఖ) నియమితులయ్యారు. సభ్యులుగా కృష్ణమూర్తి, గోపి, విజయ్, ఎం.రమేష్, కె.రమణ, సుబ్బారావు, సుభాన్, సుధా శ్రీను, లతా శ్రీను, సత్యనారాయణలను ఎన్నుకున్నారు. బ్యాగ్ మాజీ అధ్యక్షుడు మేకా నాగేశ్వరరావు, అశోక్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వరరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు గోకుల యాదవ సామాజిక భవనం ప్రారంభం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు పరిధి గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా నిర్మించిన గోకుల యాదవ సామాజిక భవనాన్ని శనివారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభిస్తారని వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పారిశ్రామిక ప్రాంత యాదవ సోదరులు, యాదవ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

నేటి నుంచి ఉక్కుహౌస్‌లో ఫొటో ఎగ్జిబిషన్

ఉక్కునగరం: వాల్తేరు ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉక్కుహౌస్ బ్యాంకెట్ హాల్లో నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌ను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ప్రారంభించనున్నారు. ఎగ్జిబిషన్‌లో 1940 సంవత్సరం నుంచి 2023 వరకు వాడుకలో ఉన్న కెమెరాలను ప్రదర్శించనున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న హజీద్ అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్‌కు చెందిన హజీద్ ఈ నెల 15న తన కుమార్తెను తీసుకుని కేంద్రీయ విద్యాలయ స్కూల్‌కు బైక్‌పై బయలుదేరాడు. పోర్టు ఆస్పత్రి నుంచి యూటర్న్ తీసుకున్న సమయంలో బైక్ ఢీకొట్టింది. హజీద్‌కు తీవ్ర గాయాలు కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు.

వ్యక్తి ప్రగతికి అంతర్గత ప్రేరణ కీలకం



వీసీ ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: అంతర్గత ప్రేరణే వ్యక్తి ప్రగతిలో కీలకమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సీఏ విద్యార్థుల సదస్సు సంకల్ప్–23ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ యువత కొత్త ఆలోచనలు దేశానికి పెద్ద సంపదగా మారనున్నాయన్నారు. ఎస్ఎస్ఈబీ చైర్మన్ మంగేష్ పి కినరే మాట్లాడుతూ నూతన కరిక్యులంను అమలు చేస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీధర్ మప్పల మాట్లాడుతూ సీఏ వృత్తిలో అడుగిడటం విజయానికి ఆరంభంగా భావించాలన్నారు. సదస్సు సంచాలకుడు డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌కు అవసరమైన బలమైన పునాదులు నిర్మించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్‌సీ, సికాస చైర్మన్ ఆర్.చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఏకాగ్రతతో పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సికాస చైర్మన్ స్వరూప్, వైస్ చైర్మన్ పి.నాని కార్తీక్, విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ ప్రసాద్ కె.పాండ,పెద్ద సంఖ్యలో సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ (క్లరికల్) అధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించినట్లు తెలియజేశారు. ఫైజర్ ఇండియా, ఏషియన్ పెయింట్స్, ఇండిగో ఎయిర్ లైన్, వింధ్యా ఇ– ఇన్ఫోమీడియా, సెంట్రల్ ఫార్మసీ, బీపీసీఎల్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, మాక్స్ ఫ్యాషన్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 457 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 253మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. వారిలో 64మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందించారు. ఉపాధి శిక్షణ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవీ లత జాబ్‌మేళాలో అభ్యర్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి ‘పశ్చిమ’ సమస్యలు

- జేసీ, జీవీఎంసీ కమిషనర్‌తో ఆనంద్‌కుమార్ సమావేశం



జేసీ విశ్వనాథన్, కమిషనర్ సాయికాంత్ వర్మకు సమస్యలను వివరిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ప్రధాన సమస్యలను వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నియోజక వర్గ సమస్యలపై శుక్రవారం జాయింట్ కలెక్టర్ కె. ఎస్. విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ రైల్వే శాఖతో ముడిపడి ఉన్న దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఆనంద్‌కుమార్ ప్రస్తావించిన ప్రధాన సమస్యలు

- 52వ వార్డు కరాసా నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు రైల్వే ట్రాక్ సమీపంలో మెయిన్ డ్రైన్ నిర్మాణం.
- 56వ వార్డు చాకలి గెడ్డ దయానందనగర్, ముత్యమాంబ కాలనీ ప్రజల కోసం సబ్‌వే నిర్మాణం.
- 57వ వార్డు సుభాష్‌నగర్ వద్ద గల రైల్వే డ్రైన్ వెడల్పు చేయడం, శ్యామ్‌నగర్ వద్ద మెయిన్ డ్రైన్ నిర్మాణం
- 90వ వార్డు గవర వీధి వద్ద డ్రైన్ నిర్మాణం
- 89వ వార్డు కొత్తపాలెం అండర్ పాస్‌వే వెడల్పు చేయడం
- 91, 92 వార్డుల్లో జువ్వాలమ్మ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి రైల్వే ఆమోదం, బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీ నుంచి శ్మశానం వరకు రోడ్డు నిర్మాణంతో పాటు వెంకటాపురం 5 మదుముల వద్ద రోడ్డు నిర్మాణం, శ్రీరామ్‌నగర్ వద్ద కాల్వ డ్రైనేజీ నిర్మాణం చేయాలని కోరారు. రైల్వే డీఆర్ఎం సమావేశం నిర్వహించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుణిశెట్టి శ్రీనివాసరావు, నమ్మి శ్రీను పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రావణ లక్ష్మి పూజలు



నాగేంద్ర కాలనీ సంతోషిమాత ఆలయంలో కలశ పూజల్లో పాల్గొన్న భక్తులు



లక్ష్మీదేవిని ఆరాధిస్తున్న మహిళలు

మల్కాపురం: శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో పలువురు మహిళలు తమ ఇళ్లల్లో శ్రావణ తొలి శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి రూపాలను ఇంట్లో తయారు చేసుకుని బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు,సుగంధ మాలలు అలంకరించారు. వివిధ రకాల పిండి వంటలు,పండ్లు అమ్మవారికి నైవేద్యంగా ఉంచి పూజలు చేశారు.61వ వార్డు మల్కాపురం పల్లివీధి వద్ద సత్యకుమారి ఆధ్వర్యంలో పలువురు మహిళలు లలిత పారాయణం, వైభవ లక్ష్మి నామాలు ఆలపించారు.

సంతోషి మాతకు విశేష పూజలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సంతోషి మాత ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. 11 గంటల నుంచి సామూహిక కలశ పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్కాపురం: సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 61వ వార్డు మల్కాపురంలో శుక్రవారం మలేరియా విభాగం అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ బయాలజిస్ట్ డి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఇంటితో పాటు చుట్టు పక్కల ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంట్లో నీటి నిల్వలు రోజుల తరబడి ఉంచరాదన్నారు. నీటి కుండీలపై పైకప్పులు తప్పని సరిగా అమర్చాలని.. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు డంప్ చేయడం నేరమన్నారు. వీధుల్లోకి వచ్చే వాహనాలకు తడి – పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. మన నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు,హెల్త్ అసిసెంట్‌లు పాల్గొన్నారు.

కార్పొరేట్ల పరమవుతున్న రవాణా రంగం



మాట్లాడుతున్న సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్

డాబాగార్డెన్స్ : ప్రభుత్వాలు రవాణా రంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాయని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆరోపించారు. విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ శుక్రవారం సిటు కార్యాలయంలో నిర్వహించారు. డి. అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో జిల్లా నలుమూలల గల 10 రంగాల నుంచి 80 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ నూతన రోడ్డు రవాణా భద్రత చట్టం డ్రైవర్లకు ఉరితాడుగా మారిందన్నారు. ఒకటి, రెండు కార్లున్నవారు తీవ్రంగా దెబ్బతింటున్నారని చెప్పారు. డ్రైవర్లుగా పని చేస్తున్నవారికి వృత్తి, ఉపాధి పోతుందని, విదేశీ కార్పొరేట్ సంస్థలను వ్యతిరేకించాలని, చిన్న యజమానులకు రక్షణ కల్పించాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి. జగన్ మాట్లాడుతూ జిల్లాలో గల ట్రాన్స్‌పోర్టు కార్మికులందర్నీ ఐక్యం చేసి అక్టోబర్ 5న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టాలని కోరారు. జిల్లా మహాసభ అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బి. జగన్, అధ్యక్షుడిగా కె. శివజగ్గాప్పారావు, ఉపాధ్యక్షులుగా డి. అప్పలరాజు, కె. పోలినాయుడు, సీహెచ్ శ్రీనివాసరావు, కె. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి. అప్పలరాజు, సహాయ కార్యదర్శులుగా ఆర్. చంద్రరావు, సీహెచ్ బాలరాజు, కోశాధికారిగా డి. లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు.

IN THE HONOURABLE COURT OF THE IInd ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P.No. 35/2023

Between :
Koribilli Jaya Harini ... Petitioners
And :
S.Kanaka Mahalakshmi & 22 Others .... Respondents
To,

GENERAL NOTICE

1. S. Kanaka Mahalakshmi, 2. T.N.V.Lakshmi, 3. N.V.Gowrinadh, 4. R.Srinivasa Rao, 5. K.Srinivasa Rao, 6. G.Easwaramma, 7. M.Subhadradevi, 8. K. Sharat Babu, 9. K.Balakrishna, 10. John Babu Malla, 11. S.Mangeswari, 12. Eaty Sujatha, 13. K.Srilatha, 14. K.Satyavathi, 15. P.L.Prasanthi, 16. P.Prasada Rao, 17. Kalla Nagamani, 18. N.Ananda Rao, 19. Sreedharala Joga Rao & Sons, Visakhapatnam, 20. Tagore Modern Raw Rice Mill, Guntur, 21. Kosuri Srinivasa Rao, 22. K.Papayyamma, 23 Dadi Syamala.
... **Respondents**

The above named petitioner has filed the above Petition against the Respondents to declare her as an insolvent person and for other reliefs and the matter is stands posted to **18-09-2023**, for your appearance on that day you are personally or through an Advocate attend before the above named Court at 10.30 AM failing which the mater will be decided as per Law.

K.MADHUSUDANARAO, Advocate,
Visakhapatnam. Cell : **99890 12912**